నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: కొత్త సర్వీసుల విడుదల, ఫీడర్ల మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున శనివారం పలు సబ్‌స్టేషన్‌లు, ఫీడర్ల పరిధిలో నిర్ణీత సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు నార్సింగి ఏఈ మణికంఠ తెలిపారు. నార్సింగి మార్కెట్ యార్డ్ సబ్‌స్టేషన్ పరిధలోని పీజీ కాలేజీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12గంటల నుంచి 12.30గంటల వరకు... సాయిబాబ దేవాలయం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3గంటల నుంచి 3.30 గంటల వరకు... కోకాపేట సబ్‌స్టేషన్ పరిధిలోని అక్షయపాత్ర ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12గంటల నుంచి 12.30గంటల వరకు... ఇబ్రహీంబాగ్ సబ్‌స్టేషన్ పరిధిలోని వాసవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12గంటల నుంచి 12.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

జోగులాంబ ఆలయానికి ప్రత్యేక బస్ సర్వీస్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పరిసర ప్రాంత ప్రజలకు చక్కటి అవకాశాన్ని కల్పిస్తుందని రాజేంద్రనగర్ డిపో అధికారులు తెలిపారు. శనివారం, ఆదివారాల్లో జోగులాంబ దేవాలయం దర్శనం చేసుకోవడానికి రాజేంద్రనగర్ డిపో నుంచి ప్రత్యేక బస్ సర్వీసు అందుబాటులో ఉందన్నారు. ఈ బస్ ఉదయం 6గంటలకు బయల్దేరి 10గంటలకు జోగులాంబ ఆలయానికి చేరుకుంటుందని తెలిపారు. అక్కడే భోజనాలు చేసిన తరువాత అక్కడి నుంచి పెబ్బేర్‌లోని దర్శనం, బిచ్‌పల్లి వద్ద కృష్ణానదిలో కూడా దర్శనం చేసి తిరిగి రాత్రి 10గంటలకు డిపోకు చేరుకుంటుందని పేర్కొన్నారు. పెద్దలకు రూ.900, పిల్లలకు రూ.700 చార్జీలు ఉంటాయని తెలిపారు. 30 మంది ప్రయాణికుల కంటే ఎక్కువగా ఉంటే వారి నివాస ప్రాంతానికే బస్సును పంపిస్తామన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడిగా మధుచారి



మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డిని కలిసిన డివిజన్ బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు మధుచారి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ వాంబే కాలనీకి చెందిన మధుచారి డివిజన్ బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం డివిజన్ అధ్యక్షులు రాఘవేందర్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పోచమ్మ దేవాలయం సింహద్వారం ప్రారంభం



శంషాబాద్: పట్టణంలోని సూరజ్‌గార్డెన్‌లోని పోచమ్మ దేవాలయం సింహద్వారాన్ని శుక్రవారం నిర్వాహకులు ప్రారంభించారు. రెడ్డిబస్తీ, యాదవబస్తీతో పాటు వివిధ కాలనీల నుంచి భక్తులు ఈ ఆలయానికి బోనాలు తీసుకొచ్చి సమర్పిస్తారు. ఈ సందర్భంగా బోనాల పండగకు ఆలయం పూర్తిగా ముస్తాబు చేయడంతో పాటు సింహద్వారాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కె. చక్రధర్ రెడ్డి, ప్రవీణ్‌ముదిరాజ్, బండి శీను, అశ్విన్‌రెడ్డి, విజయ్, బొబ్బిలి ప్రవీణ్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక బోనాలు

గోల్కొండ: మత సామరస్యానికి ప్రతీక బోనాలు నిలుస్తాయని రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ భగవంతరావు, గోవింద్‌రాఠీ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు వైభవోపేతంగా నిర్వహించే బోనాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలన్నారు. గోల్కొండ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న డాక్టర్ భగవంతరావు, గోవింద్‌రాఠీని సీనియర్ నాయకుడు లక్ష్మణ్‌యాదవ్ ఘనంగా సత్కరించారు.

తల్లిదండ్రుల చెంతకు చిన్నారి

మైలార్‌దేవ్‌పల్లి: తప్పిపోయిన చిన్నారిని కానిస్టేబుల్ యాదగిరిరెడ్డి తల్లిదండ్రుల వద్దకు చేర్పించాడు. శుక్రవారం ఉదయం 11.30 గంటలకు చిన్నారి ఏడుస్తూ రోడ్డుపై కనిపించింది. అటు నుంచి వస్తున్న పోలీసులు చిన్నారిని ఎత్తుకొని తల్లిదండ్రుల జాడ కోసం వెతికారు. సుమారు 3గంటలు శ్రమించి తల్లిదండ్రుల వద్దకు చిన్నారిని చేర్చారు.తప్పిపోయిన తమ బిడ్డ ఒక్కసారిగా కనిపించడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. కానిస్టేబుల్ యాదగిరిరెడ్డికి చిన్నారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎంఎస్ఎంఈ పాలసీని సమర్థవంతంగా అమలు చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్

మాదాపూర్: తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంఎస్ఎంఈ పాలసీని సమర్థవంతంగా అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ టెక్నాలజీ ఎక్స్‌పో రెండో ఎడిషన్‌ను ఆయన ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో ముఖ్యఅతిథిగా జయేశ్‌రంజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాలతో సహా పరిశ్రమల పూర్తి ఎకోసిస్టమ్ ఈ ఎక్స్‌పోలో ప్రాతినిధ్యం వహించడం సంతోషంగా ఉందన్నారు. పలు స్టాళ్లను సందర్శించి ప్రదర్శకులతో మాట్లాడి తాజా ఉత్పత్తులను పరిశీలించారు. ఆధునిక పరిశ్రమలు స్టార్టప్ ఆధారంగా నడుస్తున్నాయన్నారు. ఎఫ్‌టీసీసీఐ వంటి సంస్థలు ముందుండి ఎంఎస్ఎంఈ పాలసీ అమలులో కీలకపాత్ర పోషించాలన్నారు. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు డాక్టర్ సురేష్‌సింగాల్ మాట్లాడుతూ.. ఐఐటీఈఎక్స్-2025లో మొబిలిటీ, రెన్యూబుల్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, స్మార్ట్‌టెక్, ప్యాకేజింగ్, కోల్డ్ స్టోరేజ్, మెషీన్‌టూల్స్, ఇండస్ట్రియల్ ఆటోమెషీన్ రంగాల్లో వినూత్న పరిష్కారాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉచిత ప్రవేశం ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ట్రూజన్ సోలార్ మేనేజింగ్ డైరెక్టర్ భవాని సురేష్ మాట్లాడుతూ..ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెల్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. పీఎం సూర్యఘర్ పథకం ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలు, తెలంగాణలోని 30 వేల పాఠశాలలను సోలార్ విద్యుత్ మార్చాలని తెలిపారు. కొత్త కమర్షియల్ భవనాలలో కనీసం 20 శాతం సోలార్ ఆధారంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేటు లిమిటెడ్ సీఈఓ సత్యనారాయణ, ఎక్స్‌పో కన్వీనర్ విగ్నేష్‌గుప్తా, ఎఫ్‌టీసీసీఐ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ఆర్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న జయేశ్‌రంజన్ తదితరులు

'ఎస్కీ' క్యాంపస్‌ను మామిడి వనంలా మారుస్తాం



మామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిన దృశ్యం

రాయదుర్గం: ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్‌ను మామిడి వనంలా మారుస్తామని 'ఎస్కీ'డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని 'ఎస్కీ'క్యాంపస్‌లో మామిడి మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మా క్యాంపస్‌లో అనేక రకాల చెట్లు, పచ్చదనం ఉన్నప్పటికీ మామిడి చెట్లు లేవని గుర్తించామన్నారు. దీంతో ప్రత్యేకంగా మామిడి మొక్కలను క్యాంపస్ అంతటా నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన వివరించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా మామిడిలోని కేసర్, దశేరి, బంగినపల్లి, అల్ఫాన్సో, నీలం, రత్నగిరి, హిమసాగర్ వంటి అరుదైన రకాల మామిడి మొక్కలను తెప్పించి నాటడం ఆరంభించామన్నారు. మా క్యాంపస్‌లో శిక్షణకు వచ్చిన ప్రతి వ్యక్తి మొక్క నాటేలా చూస్తామన్నారు. ఎస్కీ అధికారులు లక్ష్మీకాంతారావు, డాక్టర్ పి రాజారావు, శ్రీధర్‌బాబు, డాక్టర్ ఆర్ వెంకట్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ జ్యోతి, పలువురు అధ్యాపకులు, ఉద్యోగులు, శిక్షణ కోసం వచ్చిన ఇంజినీర్లు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు సూపర్ లగ్జరీ బస్సులు

మియాపూర్: ఆర్టీసీ మియాపూర్-1 డిపో పరిధిలో ఆంధ్రప్రదేశ్‌లోని పుణ్యక్షేత్రాల సందర్శనకు ప్రతి శుక్ర, శని, ఆదివారాల్లో సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నట్లు మేనేజర్ మోహన్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం, ద్వారక తిరుమల, అన్నవరం, సింహాచలం, వైజాగ్, అరకు ఆలయాలకు ప్రతి శుక్ర, శని, ఆదివారాల్లో నాలుగు రోజుల పాటు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని తెలిపారు. ఈ బస్సులు మియాపూర్ నుంచి ప్రతి శుక్రవారం రాత్రి 8 గంటలకు బయల్దేరి దర్శనాలనంతరం సోమవారం రాత్రి 10 గంటల వరకు మియాపూర్ డిపోకు చేరుకుంటుందని తెలిపారు. జూలై నెలలో 4, 11, 18, 25 తేదీల్లో బస్సులు నడపబడునని తెలిపారు.

తెలంగాణలో సందర్శన..

ఆర్టీసీ మియాపూర్-1 డిపో పరిధిలో తెలంగాణలోని పుణ్యక్షేత్రాల సందర్శనకు ప్రతి శని, ఆదివారాల్లో సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. తెలంగాణలోని స్వర్ణగిరి, యాదగిరిగుట్ట, శివాలయం, జైనమందిర్, భద్రకాళీ టెంపుల్, వెయ్యి స్తంభాలు, లక్నవరం, తాడువాయి సీసర్ఫ్, మల్లూరు లక్ష్మీనరసింహా ఆలయం, మేడారం, రామప్ప ఆలయం రెండు రోజుల పాటు దర్శించుకునేందుకు సూపర్ లగ్జరీ బస్సులతో ప్రత్యేక టూర్ ప్యాకేజీ నడపడం జరుగుతుందని తెలిపారు. ఈ బస్సులు మియాపూర్ నుంచి ఉదయం 5 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 10 గంటల వరకు మియాపూర్ డిపోకు చేరుకుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్నీ వివరాలకు 76590 29882, 99592 26153 లలో సంప్రదించవచ్చు.

వైభవంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు

రాజేంద్రనగర్: బుద్వేల్ కోట మైసమ్మ దేవాలయంలో నిర్వహిస్తున్న వారాహి దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం అనంతరం అలంకరణతో పూజ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం కావడంతో మహిళా భక్తులు దేవాలయానికి తరలివచ్చారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాహారతిలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.



సూరజ్‌గార్డెన్‌లో ప్రారంభించిన సింహద్వారం

మత్తు పదార్థాలకు అలవాటు పడితే అంతే..



సమావేశంలో మాట్లాడుతున్న మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్

మైలార్‌దేవ్‌పల్లి: మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు చిత్తు అవుతాయని మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాజేంద్రనగర్ మండల తెలంగాణ రికగ్నైజేషన్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రిస్మా) ఆధ్వర్యంలో మధుబన్ కాలనీ కాకతీయ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు, యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తు మానవత్వాన్ని మింగేస్తుందని చెప్పారు. సమాజంలో మత్తు వ్యసనం రోజురోజుకు పెరుగుతోందని అన్నారు. మత్తు వ్యక్తిని శారీరకంగా, మానసికంగా కుంగదీయడంతో పాటు ఆర్థికంగా నష్టపరుస్తుందని అన్నారు. మానవ జీవితానికి డ్రగ్స్ అత్యంత ప్రమాదకరమని, కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తుందని హెచ్చరించారు. వ్యవసనాలకు బానిస కావొద్దని సూచించారు.

◆ రాజేంద్రనగర్ మండల విద్యాశాఖ అధికారి శంకర్‌రాథోడ్ మాట్లాడుతూ... మత్తు పదార్థాలకు యువత అలవాటు పడకుండా ఉంటేనే తమ భవిష్యత్ బాగుంటుందన్నారు. బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం మధుబన్‌కాలనీ చౌరస్తాలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సత్యకుమార్, విశ్వనాథ్‌రెడ్డి, ట్రిస్మా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి భీమ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాఘవేందర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి మల్లెల శ్రీనివాస్‌రెడ్డి, రాజేంద్రనగర్ మండల ప్రధాన కార్యదర్శి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

శాంతిసరోవర్‌లో 'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్'కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.ఈ కార్యక్రమాన్ని సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'యాక్టివిటీస్ ఫిల్డ్ విత్ ఫన్, వాల్యూస్ అండ్ లెర్నింగ్'పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ యోగా డేపై క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు, అంతేకాకుండా మెడిటేషన్, పాటలు పాడే, నేర్చుకునే కార్యక్రమం, ఇతర రకాల ఫన్ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

ఫాగింగ్ రికార్డుల పరిశీలన



ఫాగింగ్‌ను పరిశీలిస్తున్న డీసీ రవికుమార్

రాజేంద్రనగర్: బన్సీలాల్‌నగర్‌లో శుక్రవారం దోమల నివారణకు నిర్వహించిన ఫాగింగ్‌ను సర్కిల్ డీసీ డా.రవికుమార్ పరిశీలించారు. అదే విధంగా గురువారం శాస్త్రిపురంలో నిర్వహించిన ఫాగింగ్ రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీ రవికుమార్ మాట్లాడుతూ... ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కుళాయి, పూలతొట్టి, కుండీల నీరు నిలవ ఉండకుండా చూసుకోవాలని ప్రజలను కోరారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

గన్‌ఫౌండ్రీ: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో భాషా, సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీల సౌజన్యంతో ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ ది డిసబుల్డ్ సంస్థ ఆధ్వర్యంలో హెలెన్ కెల్లర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ రోజుల్లో చాలా మంది చిన్న చిన్న విషయాలకే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంగవైకల్యంతో బాధపడుతున్న చిన్నారులు ఏమైన సమస్యలు ఉంటే కమిషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం హెలెన్ కెల్లర్, జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు.!

● రీ టెండర్లకు సన్నాహాలు ● ముందుగా నార్సింగి-షేక్‌పేట రోడ్డు అభివృద్ధి



మొదటగా పనులు జరుగనున్న షేక్‌పేట - నార్సింగి రోడ్డు

మణికొండ: ప్రజలను పట్టి పీడిస్తున్న సమస్యలను పరిష్కరించి వారికి ఉపశమనం కలిగిద్దామని అధికారులు చేసిన ప్రయత్నం విఫలమయ్యింది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అనేక కాలనీల మీదుగా పారుతున్న పండెన్‌వాగు నాలా అభివృద్ధికి రూ. 99 కోట్లు, భాగ్యలక్ష్మికాలనీ నుంచి మర్రిచెట్టు వరకు ఉన్న రోడ్డును 4లైన్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ.9 కోట్లు, షేక్‌పేట నుంచి నార్సింగి వరకు ఉన్న రోడ్డును సీసీ రోడ్డుగా వెడల్పు చేసేందుకు రూ.15కోట్ల పనులకు టెండర్లు పిలిచిన విషయం తెలిసిందే.

◆ సదరు పనులలో పండెన్‌వాగు, మర్రిచెట్టు రోడ్ల అభివృద్ధికి ఒక్క కాంట్రాక్టర్ సైతం టెండర్ వేయకపోవటం అధికారులను విస్మయం కలిగించింది. షేక్‌పేట - నార్సింగి రోడ్డులోని ఫ్రెండ్స్‌కాలనీ నుంచి గీతాంజలి స్కూల్ వరకు ఉన్న సీసీ రోడ్డును సాధ్యమైనంత వెడల్పు చేసేందుకు మాత్రం ఐదుగురు కాంట్రాక్టర్లు టెండర్లు వేశారు.

◆ వారి వివరాలను ఈఎన్‌సీకి పంపి వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసేందుకు మణికొండ మున్సిపాలిటీ ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం అయ్యారు. టెండర్ ఫైనల్ అయిపోయిన వెంటనే రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలు, బీఆర్‌సీ ముందు ఉన్న చింత చెట్లను రీలొకేట్ చేసేందుకు సదరు సంస్థలకు లేఖలు రాసేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. మిగిలిన రెండు పనులకు మరో మారు టెండర్లు పిలిచేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం

బండ్లగూడ: ఢిల్లీలో బీఎల్‌వోలకు, బీఎల్‌వో సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ పూర్తయ్యింది. కార్పొరేషన్ నుంచి జూనియర్ అసిస్టెంట్ కె.సూర్యప్రకాష్ ట్రైనింగ్ పూర్తి చేసుకోని సర్టిఫికెట్ అందుకున్నారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న జూనియర్ అసిస్టెంట్ సూర్యప్రకాష్

పనులను పూర్తిచేసి రోడ్డును అందుబాటులోకి తేవాలి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ ఓంనగర్‌కాలనీలో అబ్బాం కన్‌స్ట్రక్షన్ సీఎస్ఆర్ ఫండ్‌తో పోచమ్మ దేవాలయం లైన్‌లో సీసీరోడ్డు వేయించామని మాజీ కార్పొరేటర్ ప్రతినిధి గోకరి సురేష్‌గౌడ్ అన్నారు. ప్రజావసరాల నిమిత్తం ఈ రోడ్డు పనులను వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఓంనగర్ కాలనీ అధ్యక్షుడు తీగుళ్ల శ్యాములుగౌడ్, నర్సింలు, బాలాజీ నాయక్, కాలనీవాసులు లక్ష్మణ్, కిరణ్, శ్రీనివాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా భావించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్‌లోని ఫోర్ట్ వ్యూ అపార్ట్‌మెంట్‌లో తడి, పొడి, హానికర చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. 2వ డివిజన్‌లోని గాయత్రీనగర్‌కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించారు. హిమగిరినగర్ కాలనీలో దోమల లార్వ ఎదుగుదలను నియంత్రించేందుకు ఆయిల్ బాల్స్ వేయించారు. 3వ డివిజన్‌లోని మాధవినగర్‌లో నిర్మాణం అవుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించి నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ డి.మధుసూదన్, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్ర.. భక్తజన శరణుఘోష

కనులపండువగా జగన్నాథుడి రథయాత్ర

మైలార్‌దేవ్‌పల్లి: జగన్నాథ రథయాత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం కాటేదాన్ దేవాలయంలో పూరి జగన్నాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాటేదాన్ హనుమాన్ దేవాలయం నుంచి లక్ష్మీగూడా హౌసింగ్ బోర్డులోని పూరి జగన్నాథ్ ఆలయం వరకు రథయాత్ర సాగింది. వేలాది భక్తుల శరణు ఘోషతో కాటేదాన్ పరిసరాలు మార్మోగాయి. ఈ సందర్భంగా బందోబస్తు నిర్వహించిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ పాండుయాదవ్, మన్మోహన్‌రెడ్డి, గయదర్, అభిమన్యు, పాప్పట్ మున్నా, ఎన్ను శంకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, జగన్నాథ్ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులు, భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు.



రథయాత్రకు భారీగా హాజరై భక్తజన సందోహం

టీఎన్‌జీవోస్ కాలనీలో...

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టీఎన్‌జీవోస్ కాలనీలో శుక్రవారం పూరి జగన్నాథ్ రథయాత్రను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు టి.ప్రేమ్‌గౌడ్, ధనుంజయ్, శ్రీనివాస్‌రెడ్డి, రోహిత్, నాని, శేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రథయాత్ర ఊరేగింపులో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి



టీఎన్‌జీవోస్ కాలనీలో పూరి జగన్నాథుడి పూజల్లో కాంగ్రెస్ నాయకులు